# చతురస్రం

**సీరియల్ కథ**

[అజంతా వ్రాసిన మొదటి అధ్యాయం క్రిందటి వారం ప్రచురించాము. ఇది రెండవ అధ్యాయం. రచన శ్రీ ఏల్చూరి సుబ్రహ్మణ్యం.]

(గత సంచిక తరువాయి)

## (2)

ఆతను ఆదిమ మానవుడన్నా అయి ఉండాలి, లేదా రానున్న తరానికి ప్రాతినిధ్యం వహిస్తుండాలి. ఈ రెండూ కాకుంటే, నులక మంచంలా గజిబిజిగావున్న అతని ముఖం అతనికే ఒక్కొక్కనాడు మందారపువ్వులా దేనికి కనిపిస్తుంది?

వెంకట్రావు కన్ను—చతురస్రంలా వున్న అతని గది కిటికీలోనుండి ఎట్టెదుటవున్న మొండిగోడల మధ్య నిటారుగా చూస్తుండడం దేనికి? ఆ గోడలు ఎవరు కట్టుకున్నారో వారు లేరు ఇప్పుడు ఇటుకఇటుకకూ మధ్యన దట్టంగాపెట్టిన సున్నంజీరకూడా కనుపించడం లేదు ఆ నాలుగే నాలుగు గోడలమధ్య—తూరుపుదిక్కు గోడ మధ్యనుంచి ఇటుకలు కూలడం ప్రారంభమై వుంటుంది.

అక్కడే సింహద్వారం ఉండొచ్చు. ఆ పడిపోయిన గోడ—అక్కడ కుడి ఎడమల చీలి, నెరియలు పడి అర్ధవర్తులాలవలె కనుపిస్తున్నది. మధ్యలో ఏవో గదులున్నట్టే ఆనవాళ్లు పొడకట్టుతున్నాయి. దశదశాబ్దాల క్రితం గది కొక పోలీసో, గజదొంగో అక్కడ మకాంచేసి వుంటారు. కాకుంటే ఒక 'కలిగినవాడు' గదికో ఇల్లాలును కట్టుకొని అక్కడ కాపురం చేసి వుండొచ్చు ఏమైనా ఆ మొండిగోడల వాలకంచూస్తే—అణచివేయబడిన ఒక ఉదంతాన్ని సవిస్తరంగా చెప్పడానికి అవి నోళ్ళు తెరుచుకుంటున్నట్టున్నాయి.

వెంకట్రావు చూపు — లోతుకుపోయిన ఆ సీలికళ్లు వందమైళ్ళ దూరానవున్న ఏదో పెద్ద నల్లటి మ్రోడుమీద, విడిది దిగినట్టువున్న పచ్చటికొమ్మల అయస్కాంత వృక్షాన్ని, ఆ చెట్టు చిటారుకొమ్మమీద కుప్పిగంతులువేస్తూ ముద్దొస్తున్న మర్కటాన్ని చూస్తున్నట్టుంది నిద్రలేచీ లేవడంతో కాలకృత్యాలు ముగించుకొన్నాడు కిటికీలోనే కూర్చుని పంట్లాం జేబులోనుంచి ఒక కాగితపుబంతిని వెలికి తీశాడు. కొడికట్టిన వత్తులవలె ఉన్న ఆ అక్షరాలు, బారులు బారులుగా కాటుక కొండలలా కనుపించేసరికి ఏదో పెద్ద అలసటతో ఆ కాయితాన్ని నలుపబోయి, "అమ్మో" అని దిక్కులు దద్దరిల్లేట్లు కేకలేశాడు.

చిత్తుకాయితాల్ని నలిపి పారెయ్యడం, నలుగురి గొంతులు నులిమివెయ్యడం కష్టం. అతను జంతువుకాదు, గడ్డిలా నమిలివెయ్యడానికి

అనాసక్తుడు తిరునాళ్ళకుపోయి, పోయినవాడు పోయినట్టే తిరిగి వచ్చినట్టు — ఆ కాయితపుబంతి వదులాదులుగా ముడిపడివున్న అతని వ్రేళ్ళమధ్య పంజరంలోని చిలుకలాగా ఏదో ఒక్కొక్కపలుకు, పలుకుతున్నది. 'ఇంత భయంకరమైన ప్రేమలేఖ రాసి, మాకు ముక్కు, కళ్ళూ, నోరూ, నాలుకలూ కట్టి — నీ చేత్తో నీవు మమ్మల్ని మా సంకేతాన్ని చేర్చలేక

పోయినావు కనీసం పోస్టుడబ్బాలో పారేసినా రెక్కలు కట్టుక పోయేవాళ్ళం.... మేము పచ్చ పచ్చగా ఆ సంగతులు జ్ఞాపకం చేస్తుంటాము'

కాయితంమీద ప్రతి అక్షరం మాట్లాడుతున్నది ఆకాశ కన్యకలాంటి ఆ అమ్మాయిని-ఆ నిగనిగను ఆవీ చూచినట్టు - అసలు ఆ ఆ అక్షరాలే గులాబీరంగు పరికిణీ, మల్లెపూల జాకెట్టు, ఊదారంగు వోణీ వేసుకున్నట్టు వెంకట్రావుకు సాక్షాత్కరించాయి. అయినా అవి అక్షరాలన్న స్ఫురణ కలిగించిన విషాదరోదన అతన్ని నఖశిఖపర్యంతం గుడ్డను నులిమేసి ఊతికినట్టు, ఉతకడం మొదలైంది

ప్రతి అక్షరమూ పొగలు క్రక్కుతున్నది కాయితంబంతి బ్రద్దలవుతున్న అగ్నిపర్వతం లాగా, బహుళపంచమి జ్యోత్స్నలాగా భయపెట్టింది. కాదు, అసలు ఆ పొగలుచూస్తుంటే, అతను ప్రయాణంచేస్తున్న రైలు ఇంజన్‌లా, అవి ధుమధుమ లాడుతున్నాయి

అతను గదిలో, అక్షరాలా నాలుగుగోడల మధ్యన ఉన్నట్టే లేడు మొండిగోడలు, చెట్లు, కొండలు, మిట్టలు, ఊళ్ళూ, టెలిగ్రాపు స్తంభాలు అన్నీ వరుసగా కదిలిపోతున్నాయి. ఒక్కసారి కళ్ళువిప్పేసరికి. అటూఇటూ జనం, పై వరుసలో పలువులు, పెట్టెలు, బుట్టలు, ఏవేవో కనుపించాయి.

ఇప్పుడు వెంకట్రావు కూర్చున్న రైలుపెట్టె కదిలిపోతున్నది. మాట్లాడుకుంటున్న వారి గొంతులు హెూరుగాలిలో స్పష్టతను కోల్పోతున్నాయి. పాలకోసం ఏడుస్తున్న పిల్లవాడు తల్లివొళ్ళో నిలవక — ఉగ్గపెడుతున్నాడు వెంకట్రావు ప్రక్కనే ఒక లావుపాటి మనిషి గురకపెడుతూ, తిన్నగా వొరిగి వొరిగి, వెంకట్రావు మీదనే పడబోతున్నాడు. గడ్డం పెరిగి వుంది. అతని కళ్ళజోడుతాడు ముడి వొదులై ముక్కుమీదనుంచి జారి, మీసాలను అంటుకొని అది వ్రేలాడుతున్నది. ఎంత జారినా, అంత లావుమనిషిమీద ఎక్కడో అక్కడ అది చోటు చూచుకో గలదనిపిస్తుంది. ఇంకా మూడుస్టేషన్లు పోతేనేగాని, వెంకట్రావు దిగవలసిన స్టేషన్ రాదు.

ఈ సారి బండి ఆగగానే ఒక్కసారి నిల్చుని వొళ్లు విదలించుకొని కళ్లజోడు సవరించుకుని పేపర్ కుర్రాణ్ణి పిలిచి ఒక పత్రిక కొన్నాడు. పత్రికకు డబ్బులిచ్చి ఆ పత్రిక అతని చేతిలోకి వచ్చీరాక ముందే ఎదుటిబల్లమీద కూర్చున్న వ్యక్తి "ఒక కాయితం ఇవ్వండి" అన్నాడు. రైలు కదిలింది టీ, కిళ్ళీ, సిగరెట్లు కుర్రాళ్ళ నెత్తిమీది పెట్టెలు పరుగెత్తుతున్నాయి

పేపర్ అడిగినాయన మాట వినిపించుకోకుండా వెంకట్రావు దాన్ని విప్పి ముఖానికి అడ్డంగా పెట్టుకొని, రెండుకొసలు రెండు చేతులతో లాగి బిర్రుగా పట్టుకొన్నాడు

పేపర్ అడిగినాయన వెంకట్రావుకు కనుపించడు వాళ్ళిద్దరి మధ్యన పత్రిక గోడ కట్టినట్టున్నది. అయితే ఆయన మాత్రం కొంగలా వొంగి పైకి కనుపిస్తున్న ఆ రెండు పేజీల్లో ఏ మూలన్నా వారఫలాలు ఉన్నాయేమోనని రిక్కించి చూస్తున్నాడు కొంచెం కొత్తవాళ్లు రావడంతో బల్లమీద వొత్తిడి ఎక్కువై-ఆ పెద్ద మనిషి మళ్ళీ కొంచెం వెనక్కు అవసరానికి తగ్గట్టు గట్టిగా అనుకొని, అటూ ఇటూ వొత్తుకుని కూర్చుని "ఈ పెట్టె కాకుంటే ఇంకో పెట్టె కనుపించడం లేదా వీళ్ళకు" అని విసుక్కొన్నాడు. నెట్టుక కూర్చోవడం అనాగరక లక్షణం, అంటూ తను ఇటూఅటూ కూర్చున్న వారిని నెట్టి కూర్చున్నాడు

అతనికి ప్రక్కగా కూర్చున్న వ్యక్తి "మీరు వారఫలాలు చూస్తుంటారా?" అన్నాడు.

"అవునండీ. కొన్ని దాఖలాలు చూచుకుంటే వాటిని కాదనలేకపోతున్నాను?"

"వాటి బలం మన నమ్మకంలో వుంది కాని, వాటిల్లో ఏమున్నదండీ?" అంటూ కొంచెం మధ్యవయస్కుడు పెదిమ విరిచాడు. ఈయనకు పెద్దగా రేగిన జుట్టూ, మాతలున్న జేబు చొక్కా, నల్లని నిక్కరూ ఉన్నాయి. ప్రక్కవాళ్ళను వొత్తిడిపెట్టడం దేనికని, దగ్గర స్టేషన్లోనే దిగిపోతున్నానని కిటికీ తలుపు పట్టుకొని నిల్చున్నాడు.

వెంకట్రావు కాయితాన్ని నిటారుగా ఒక్క మడతకూడా లాగి గోడకట్టుకున్నట్టు పట్టుకొన్నాడు. ప్రక్కచూపు చూస్తున్న పెద్దమనిషి విస్తుపోతూ—వెంకట్రావును పరీక్షగా చూస్తున్నాడు. నిల్చున్న పెద్దమనిషికి ఎదురుగా ఒక లావుపాటి పెద్దమనిషి కూర్చున్నాడు. చాలా హుందాగా కనుపడుతున్నాడు; షేర్వాణీ, చేతి వుంగరాన్ని బట్టిచూస్తే-హఠాత్తుగా నూనె వర్తకంలో చెయ్యి తిరిగినవాడనిపిస్తుంది; కాని అతను "ఘరానా జనం" అన్న చిత్రాన్ని గురించి తర్కిస్తున్నాడు. నిల్చున్నాయన ఆయన సంభాషణను వింటూ-వాళ్ళ రామారంలో —"ఆకలి" చిత్రపు "ఔట్ డోర్" షూటింగ్స్‌కు - "జగతీ" వారు వచ్చినప్పుడు అతనిచ్చిన సలహాలను పాటించని మూలాన ఆ పిక్చర్ దెబ్బతిన్న వైనం చెబుతున్నాడు. బిచ్చగాడి చేతిలోని "బొచ్చె" హఠాత్తుగా చేజారిపడి పగిలిపోవడం చూపడంకంటే, బిచ్చగాడు తల నేలకు బాదుకొని తునాతునకలవుతున్న ఘట్టం చూపిస్తే— బాగా కలెక్షన్ వస్తుందన్నాట్ట. షేర్వాణీ వేసుకున్న పెద్దమనిషి - "అవునండీ మీరు చెప్పిన మాట వాస్తవం అంతటితో బిచ్చగాడు అంతమైతే కథ ఏంకావాలి? 'కరుణ'కు ఎక్కడన్నా క్లైమాక్సు, అట్టి క్లైమాక్సూ చూపాలికదా! ఈ "షాట్" తరువాత ఏమొస్తుందో మనం పిక్చర్ తీసేటప్పుడు కథనుబట్టి ఊహించుకుంటాం" అని - అసలు "షాట్స్" ఎట్లా డివైడ్ చేస్తారో, సెట్సుమీద ఎట్లా పని చెయ్యాలో చెప్పుకొన్తున్నాడు.

ఒక్క వెంకట్రావు తప్ప - రైలు పెట్టెలో ముందు వరుసలో కూర్చున్నవాళ్లంతా ఆయన వంక సగౌరవంగా చూస్తున్నారు ఆ పెట్టెలో కొందరు సినిమా చూడని అభాగ్యులూ లేక పోలేదు; సినిమాలు చూచినా, వాటిని తియ్యడంలోని విశేషాలు ఎరిగినవాండ్లు ఆ బండ్లో లేరు, అందుకే ఆయన వాళ్ళను ఆకర్షించాడు. ఒక రైతే ఆ చిత్ర వ్యాఖ్యాత వంక తదేక దృష్టితో చూచీ, చూచీ-"మిమ్మల్ని ఎక్కడో చూచినట్టుంది" అన్నాడు

"మొన్న రిలీజ్ అయిన పిక్చర్లో చూచి వుంటారు; ఆ కొట్టుకున్నవాళ్లలో కొట్లాట సీన్లో ప్రవేశించి, నాయకుణ్ణీ ప్రతినాయకుణ్ణీ విడదీస్తాను" అన్నాడు.

వింటున్నాయన ఏమీ అనలేదుగాని, ఇంకొకడు అప్పటికప్పటికి ఆ ప్రసంగంలో తల దూర్చి-"నిజంగా, కొట్లాటలు పాడుగవకుండా విడదీసినందుకు మీకు ధన్యవాదాలుఅర్పించా" లన్నాడు. అతనిది దాటిపోయిన స్టేషనుకు ప్రక్కనేవున్న దావులూరు. గత మాసంలో ఆ వూళ్ళో ఇద్దరు పాలేళ్లు పొలంగట్టున గుద్దుకుంటుంటే అతను అడ్డం పోయిన నేరానికి, ఒక దెబ్బ గూడమీద తగిలి విరిగిపోయిందట. ఆ గూడను అతను అందరికీ చూపించాడు. "అయ్యో పాపం" అన్నట్టు పెద్దమనిషి అందరి పక్షాన జాలిని వెలిబుచ్చాడు

నిల్చున్నాయన -`ఆ గ్రామీణుని "ఎక్కడికి పోకడ?" అని ప్రశ్నించాడు అతను 'పట్నం' అని సమాధానమిచ్చాడు ఒక్క క్షణం ఆగి అతను కొంచెం నిల్చున్నాయనను వొత్తుక కూర్చోమని చోటు యిచ్చి, ఎదురుగావున్న పెద్దమనిషికి బొడ్లోనుంచి ఒక కాయితం తీసి చూపిస్తూ, "ఈ అడ్రసు తమకు గుర్తేనా అండీ?" అన్నాడు

పెద్దమనిషి-"ఓ"అంటూ,"అవును, ఫిల్ము నిర్మాత కృష్ణమూర్తిగారా? మాకు తెలుసు వారితో మీకేం పని?..."

గ్రామీణుడు గొంతు సవరించుకొని, "ఈ మధ్య మావూరు వొచ్చి పదివేలు నా దగ్గర పట్టుకెళ్ళారండీ, ఇంకా పంపలేదు. ఇదిగో పంపుతానన్నాడు పెద్దమనిషి!" అన్నాడు.

ఎందుకో ఆయన ముఖం వివర్ణమైపోయింది, వింటుండగానే

కృష్ణమూర్తిగారి పిక్చర్‌కే వీరు "పాటలూ, మాటలూ" వ్రాయను పట్నం పోతున్నారు, కాశీకిపోతూ పిల్లిని చంకన బెట్టుకపోయినట్టు ఈ శనిగ్రహాన్ని దేనికి తగిలించుకున్నానా అని ఆయన కొంచెం వివర్ణుడైనాడు.

కొంచెం ధైర్యం తెచ్చుకొని పెద్దమనిషి "సరేలెండి, ప్రక్క వరుపుల పెట్టెలో మా

ఆడవాళ్లు వస్తున్నారు. స్టేషన్ రాగానే వాళ్లను దించి వస్తాను. మీకు వార్ని కలుపుతా లెండి. ఖంగారు పడకండి!'' అని జవాబుచెప్పి, ఒక్కసారి షేర్వాణీ చెరుగుతో ముఖాన్ని విసురుకొని నల్లద్దాల కళ్ళజోడు సర్దుకుని కూర్చున్నాడు

వెంకట్రావు నీళ్ల ఉపరితలాన్ని చూడని చేపలాగా అర్ణవంలో అట్టడుగున ప్రయాణం చేస్తున్నాడు. అతనికి ఎవరితోనూ నిమిత్తం లేదు; అతను ఆ నగరానికి మాత్రం పోవాలనిపించి వెళ్లుతున్నాడు భీకరమైన తుఫానులో కొట్టుకొచ్చే ఎండుటాకులా ఎగిరివచ్చి, ముఖ్య పట్టణపు మొగసాల దేవిడీమీద పిట్టలా వాల్తాడు అంతే! అంతే. వెంకట్రావు ఆ స్టేషన్లో దిగాడు. ఇంతపెద్ద పట్టణంలో అతను ఎక్కడ దిగాలోనన్న ప్రశ్నతో బాధపడలేదు!

ఎప్పుడూ ఎక్కడ దిగాలోనన్న సంకేతం చూచుకొని అతను దిగలేదు; అతని బూట్లు మాత్రం ఎర్రగా, లావుగా, నిగనిగలాడుతూ, దార్లు పసికట్టి, వాటంతట అవే ఎక్కడికి పోవాలో అక్కడికి, అవి నిశ్చయించుకొన్న చోటికి తీసుకుపోతుంటాయి. వెంకట్రావు కొనుకున్న పేపర్ తప్ప, అతనికి ఏ సామానుమోతా లేదు! ఒక్కసారి తలుపుతీస్తే గుంపులు గుంపులుగా సామాన్లతో, సంభారాలతో దిగుతున్న జనంలోనుంచి, శరంలాగా దూసుకుంటూ దిగిపొయ్యాడు ఒక పెద్దమనిషి గొడుగుకర్ర అతని కణతకు కొట్టుకున్నా—అతను లెఖ్ఖ చెయ్యలేదు!

దిగీ దిగడంతోటే మెయిన్‌రోడ్డు తప్పించాడు, తారురోడ్డు ప్రక్కనుంచి పోతుండగా, కప్పరకప్పర చీకట్లు క్రమ్ముకొస్తున్నాయి. చీకటి జడలు విరబోసుకుంటుంటే అతనికి చికాకు వేసింది, రాత్రికి.

''బాబ్డ్ హెయిర్'' చేయిస్తే ఎంత బాగుంటుంది? అనుకున్నాడు

అంతలో రోడ్డు ప్రక్కని విద్యుద్దీపాలు వరుసగా వెలిగాయి.

అతనికి నవ్వువచ్చింది. ఒక్కడు. ఒక్కడే ఒక్కడు ఆ వీధిలో నిల్చుని దీపాల బారుని చూచి చిరునవ్వు నవ్వుకున్నాడు. రెండడుగులు దాటేసరికి ''జలజమహల్'' బోర్డు కనుపించింది. హొటల్లో అట్టే జనం లేరు.

కౌంటర్ దగ్గర కూచున్న యజమాని వుంగరాల క్రాపూ, మడతమాయని చొక్కాతో, నిండుగా, పచ్చగా కనుపిస్తున్నాడు. ఆ మెర్క్యురీ లైటు నిగనిగలో అతని కౌంటర్‌మీది గంట తళతళ లాడుతున్నది. గోడలు, బల్లలు, ఆ కాస్త దాంట్లోనే పరిశుభ్రంగాకనుపిస్తున్నాయి. ఇరకాటం ఎక్కడాలేదు; బజారులో కంటే హొటల్లో ఎంతో విరామంగా ఉన్నది యజమాని మాట్లాడకుండా, తలవంచుకుని ఏదో చదువుకుంటున్నాడు బయట ఇద్దరు కుర్రాళ్లు హొటల్ ముందర సరసంగా మాట్లాడుకుంటూ నిల్చున్నారు. వెంకట్రావు — పెద్దగా ఎవర్నీ పిలిచి, ఈ నిశ్శబ్ద గంభీర సౌందర్యాన్ని భంగం చెయ్యదలుచుకోలేదు హొటల్లో అడుగుపెట్టేసరికి అతనికి జనసందోహమంతా సర్దుమణిగేదాకా, నగరం నిద్రపోయేదాకా ఎక్కడికీ పోవాలనిపించలేదు. ఆ వెలుతురు వంక చూస్తూ కూర్చున్నాడు.

బనీను, నిక్కరు వేసుకుని కడిగిన ముత్యంలాగా పధ్నాలుగేళ్ళ కుర్రాడు, ''ఎన్ని కార్లు తెప్పిస్తున్నావురా నాపెళ్ళికి, గోపాల్?' అన్నాడు

గోపాల్ బొద్దంకిలా బిళ్లలా వున్నాడు. అయిదువ్రేళ్లు చూపిస్తూ ''అయిదురా నాలుగు-ఒకటి అనుమానంగా ఉంది—కనీసం నాలుగు కార్లన్నా తెప్పిస్తా''నన్నాడు.

''నీ మొహం ఈ వూళ్ళో గవర్నర్‌కు తప్ప ఎవరికీ పెద్దకారు లేదు మొన్న ముఖ్యపట్నామని కొత్తరోడ్డు వేశాక దాంట్లో గవర్నర్‌గారి మనుమడుపోతుంటే దాన్ని చూశాను. ఎప్పుడన్నా డ్రైవింగ్ నేర్చుకొని, అట్లాంటి కారన్నా కొనేది లేకున్నా ఎక్కి తీరాలనిపిస్తున్నది'' అంటున్నాడు

ఇంతలో ప్రొప్రయిటర్ గంటకొట్టాడు ''ఇవ్వాళ మన ''జలజ''లు ఎన్ని అమ్మివచ్చావురా బుద్దూ!'' అని తల ఎత్తకుండా ప్రశ్నిస్తుంటే ''పది పోయినయ్ సార్! పైసలు అమ్మగారి కిచ్చేశాను సార్'' అంటూ ముత్యం లాంటి ఆ పిల్లవాడు లోపలికి గంతేశాడు.

హఠాత్తుగా వాడు వెంకట్రావును చూచి—చూచీ చూడటంతోటే "ఏం కావాలి సార్? టీ. కాఫీ...." అని ప్రశ్నిస్తూ దగ్గరకొచ్చాడు వెంకట్రావుకు వాడి బూర బుగ్గలూ, ఉత్సాహం చూచేసరికి మనస్సు పాలకడలైపోయింది. అతను కాలర్ దులువుకుంటూ వాడివంక ఒక్కసారి ప్రక్కచూపు చూచి, "కాఫీ పట్టుకరా!" అన్నాడు

ప్రొప్రయిటర్ డబ్బు లెఖ్ఖలో నిమగ్నమై అణాకానులు అణాల డబ్బీలో, బేడ కానులు బేడల డబ్బీలో వేస్తున్నాడు.

కుర్రాడు కాఫీ పట్టుకొచ్చాడు

వెంకట్రావు "నీవు పత్రికలు అమ్ముతావా?" అన్నాడు.

కుర్రాడు "మా రంగనాథంగారి పత్రికే "జలజ" ఇక్కడ అమ్ముతాం సార్. కథలు బాగా ఉంటాయి" అన్నాడు

వెంకట్రావు పత్రికను తెప్పించుకొని ఆమూలాగ్రం చూస్తూ రాత్రి తొమ్మిదింటిదాకా గడిపాడు. దానివైనం చూస్తే పరిశోధక కథల పత్రికనీ, నెలనెలా వస్తున్నదనీ, కార్యాలయం ఈ హొటల్ పై అంతస్తులోనే వుందనీ తేల్చుకున్నాడు.

మర్నాటి రాత్రి తొమ్మిది కొట్టేసరికి వెంకట్రావు ఆ పత్రికలో సహాయ సంపాదకుడైనాడు బుద్ధు అతనికి కాఫీ, కాయితాలూ, అందిస్తున్నాడు.

వెంకట్రావుకు ఎట్లా ఉద్యోగం వచ్చింది, నిరుద్యోగ సమస్య ఇంత భీకరంగా ఉంటే? అని మీరడుగవచ్చు. ఎట్లా ఉద్యోగం వస్తుందో వెంకట్రావు చెప్పలేడు పత్రిక గది ప్రక్కనే యజమాని శయ్యాగృహం ఉంటుంది. దానికి ప్రక్కగా అతిథి అభ్యాగతులకు ఒక గది వుంది; వచ్చిపొయ్యే రచయితలతో శ్రీ రంగనాథం అక్కడే మాట్లాడి పంపిస్తుంటాడు వెంకట్రావు కూర్చున్న బల్లకు ప్రక్కనే తలుపులు లేని వాకిలి ఒకటుంది. డోర్ కర్టెన్ వెయ్యకపోతే మెట్లకు ఎదురుగ్గా వున్న అద్దంలోంచి పైకి ఎవరు వస్తున్నారో, పోతున్నారో అంతా కనిపెట్టుతుండొచ్చు.ప్రక్కచూపుచూచి.

ఈ రోజు రెండు మూడుసార్లు అద్దంలో సాయంత్రం ఒక చక్కటి నర్సు, కను ముక్కు తీరు ఇట్లాంటిదని వర్ణించలేనంత సుందరి, తెల్లటి గౌను వేసుకొని మెళ్ళో వొంటివరుస గొలుసుతో నిగనిగలాడుతూ, అందాలు వొలుకపోస్తూ మెరుపుతీగలా మిలమిలలాడి, మళ్ళీ కనుపించకుండా మెట్లు దిగిపోవడం వెంకట్రావు చూచాడు! బుద్ధూని మాటమాటలో కదిపిచూస్తే-ఆమె యజమాని భార్య అని తెలుసుకోగలిగాడు వెంకట్రావు ఆమె ఈ పత్రికలో వచ్చే చిత్రాలూ, ఫోటోలు సమకూర్చి పెడుతుందట.

రంగనాథం మాతృభాష ఏమిటోగాని, అతను అన్ని తెలుగు పత్రికలు చూచి, ఈ పంచవర్ణ చిత్రాంచిత పరిశోధక మాసపత్రికను పెట్టి దిగ్విజయంగా నడుపుతున్నాడని తెలుసుకున్నాడు వెంకట్రావు. మనిషి నిండుకుండలా తొణకకుండా సాదరంగా మాట్లాడే స్వభావం కలవాడు. ఆ రాత్రంతా అక్కడే కూర్చుని "అద్దంలో ఆసుపత్రి" అన్న కథ రాశాడు వెంకట్రావు పెద్ద ఆసుపత్రిలో చక్కగా ఫినాయిల్ వాసన వొస్తుంటుంది, ఒక గదిలో కార్ యాక్సిడెంట్‌లో దెబ్బతినివచ్చిన పేషెంటును కట్లుగట్టి తెచ్చి పడుకోబెడతారు; డాక్టర్లు చూచిపోయిన తర్వాత, వారి బూట్లు గరగర సద్దు మణిగిన తరవాత-రోజాపువ్వులాంటి నర్సు వచ్చి, అతని టెంపరేచర్ చూస్తుంటుంది రోగి హాయిగా వుందని చిరునవ్వు నవ్వుతుంటాడు.

"గాయం త్వరలో మానుతుంది లెండి భయపడకండి" అంటుంటే దెబ్బతగిలిన రోగి రోజాపువ్వు-రోజాలాంటి గాయంలెండి అంటూ చిరునవ్వు నవ్వుతాడు

రోజాపువ్వు-ఆ పచ్చటి చెట్టుమీద వున్నప్పుడు, ముండ్ల పొత్తిళ్లలో వున్నా-ఘాటైన వాసనను విరజిమ్ముతుంటుంది ఆ ఘాటు-అదో రకంగా వుంటుంది. దాని రేకులు అమాయకంగా వుంటాయే కాని, చెట్టుమీద వున్నప్పుడు ఒకరకంగా కనుపిస్తాయి త్రుంచి చేతిలో పెట్టుకున్నప్పుడు ఒక్కొక్కరికి ఒక

రకంగా వాటి ముఖం చూపిస్తాయి. వెన్నెట్లో తెల్లటి చారలతో, ఊదారంగు ఎరుపుచొక్కా వేసుకున్నట్టు కనుపిస్తాయి. వాటి రక్తం కాదు, రక్తిమ ఎప్పుడూ ఎర్రగా ఉండదు; పేలి పాలి వ్రాలి రకరకాలుగా ఆ పువ్వు ఆకర్షిస్తుంది. దానిలో ఆకర్షణ వున్నదేకాని, హాయిలేదు. ఆ ఘాటువాసన అంతగా గరళకంఠుడు కూడా భయపెట్టడు

రోజాపువ్వు - రోజాపువ్వులాంటి గాయమే. అంటూ అట్లా ఎందుకు రాశాను? అని ప్రశ్నించుకుంటూ వెంకట్రావు చరచరా మెట్లు దిగిపోయాడు!

వెంకట్రావు మెట్లు దిగుతుండడం-బుద్ధూ చూచాడేకాని - "ఎక్కడి"కని అడగలేదు. వెంకట్రావు రాస్తున్న కథ పూర్తికాలేదు. ★

(ఇంకా ఉంది)

# చలికాలపు ఉదయం

మూలం: ఎ. ఎస్. పుష్కిన్ అనుకృతి: శ్రీ శ్రీ

హేమంతం సూర్యకాంతి! ఎంత మంచి దివసం!
ఇంకా నిద్రపోతావేం? ఇది చక్కని ఉదయం!
సఖీ! సుభగముఖీ, చాలు సిగ్గులేని మగత
అవలింత మాను, నిదురకనుల తెరువు సుంత!
ఉత్తర దిగ్గగనం పయి చుక్కలాగ వెలుగుమా!
ఉత్తర దిక్ప్రభాతశిఖ నెదుర్కొనుము ప్రియతమా!
నిన్నరాత్రి (నీకు తెలుసు) సుడిగాలుల కేకలో
పొగమంచుల పొరలుక్రమ్మె ఆకాశపు రేకుల్లో
పచ్చని ఒక మచ్చలాగ చందమామ చల్లగా
భయపెట్టె మబ్బుల్లో ప్రయాణించె మెల్లగా
పరితాపపు ప్రతిమలాగ ప్రాణ సఖీ నీవు
కూర్చున్నావపుడు, ఇపుడో? కిటికీ తెరిచి చూడు.
నీలినీలి నింగికింద రంగు తివాసీ వలెనే
నీరెండలలో మిలమిలలాడి సొగసులాడి మంచు
నిద్రిస్తున్నది: నల్లని వస్తువన్నదే లేదు
చెట్లు మాత్రమే నల్లగ కాస్తకాస్త కనిపించును,
పొగమంచుల మడతలలో ఆకుపచ్చ సరుగుచెట్లు
అల్లవిగో! మంచుకింద నది కంటున్నది కలలు
ప్రాణసఖీ గుర్రాన్ని బండినీ పిలిపిస్తే
మరీ మంచిదనుకుంటా ప్రయాణానికిదే అదను.
పదపోదాం ప్రణయినీ ఉషఃకాల హిమానీ మృదు
పథాలలో నీవు నేను, గుర్రపు డెక్కల చప్పుడు
వింటూ, బండీ గంటలువింటూ పోదాం పదపద.
ఎవరులేని ఎవరురాని పొలాలలో తిరుగుదాం
ఆకురాలి శూన్యమైన అరణ్యాల కరుగుదాం
నాకెంతో సుఖమిచ్చే నదివొడుకు కదలుదాం.

—("సోవియట్ భూమి" నుండి.)